

ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రాస్

## ప్రజావాణి ఆర్జీలను త్వరగతిన పరిష్కరించాలి

### అధికారులకు కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశం

హైదరాబాద్, మార్చి 4,(ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చే ఆర్జీలను త్వరగతిన పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విన్నపాలను వచ్చే ప్రజావాణిలోగా పరిష్కరించి, సంబంధితులకు తెలియ జేయాలని అధికారులకు సూచించారు. మిగతా సిటీ 3వ పేజీలో

హైదరాబాద్ వార్త



## 8న పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన

- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు నిర్మాణం
- రూ.2వేల కోట్ల వ్యయంతో 5.5కి.మీ వరకు



హైదరాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: ఈ నెల8న మెట్రో రెండోదశ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఎంజీబీఎస్-ఫలక్‌నుమా మార్గం పనులను ప్రారంభించనున్నారు. 5.5కిలోమీటర్ల మెట్రో నిర్మించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.ప్రస్తుతం జేబీఎస్ నుంచి ఎంజీబిఎస్ వరకు మెట్రో రాకపోకలు సాగిస్తున్నాయి. అక్కడి నుంచి దారుషిఫా జంక్షన్, పురానీ హవేలీ, ఇత్తెబార్ చౌక్, అలీజాకోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలి, శాలిబండ, షంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా వరకు రూ.5.5కి.మీ ఆలైన్‌మెంట్ ఉంటుంది.ఈ మార్గంలో 5 స్టేషన్లు రానున్నాయి. ఎంజీబీఎస్ తర్వాత సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా స్టేషన్లతో ఈ కారిడార్ అందుబాటులోకి రాబోతోంది.

- కాగా 5.5కీ.మీ మార్గంలో చేపట్టనున్న ఈ మార్గానికి సుమారు రూ.2వేల కోట్ల వరకు ఖర్చుకానున్నట్లు అంచనా.జూబ్లీబస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు పాతబస్తీ మెట్రో నిర్మాణానికి 2012లోనే ప్రణాళికలను సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల ఎంజీబీఎస్ వరకే నిలిపివేశారు. పాతబస్తీలో రోడ్డు విస్తరణ, నిర్మాణాల కూల్చివేతలకు ఆటంకం వంటి కారణాల వల్ల పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ హయాంలోనే అడ్డకులన్నీ తొలగిపోయి డీపీఆర్ సహా అన్ని పనులు పూర్తయినప్పటికీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కూడా నిర్లక్ష్యం చేసింది. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాతబస్తీ మెట్రోపై దృష్టి సారించి, బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించింది.
- ఈ మార్గంలో ఇప్పటికే డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు. వయాడక్ట్ డిజైన్, ఎత్తులు, మెట్రో పిల్లర్ లొకేషన్‌లలో తగిన మార్పులు తదితర ఇంజనీరింగ్ పరిష్కారాల కోసం డ్రోన్ ద్వారా సేకరించిన డేటా దోహదపడుతుందని అధికారులు తెలిపారు. దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ వరకు 103 మతపరమైన, ఇతర సున్నితమైన కట్టడాలు ఉన్నట్లు గుర్తించారు. మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకు రోడ్డు విస్తరణను కూడా 80 అడుగులకే పరిమితం చేశారు. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో మొదటి ఫేజ్ ప్రాజెక్ట్ నుంచి పాఠాలు నేర్చుకోవడం ద్వారా స్టేషన్ స్థానాల్లో మాత్రం రహదారిని 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. మిగతా సిటీ 3వ పేజీలో

ఖానామెట్ ఖతం - 2

# రహదారులనూ మింగుతున్న రాబంధులు..!

## ప్రభుత్వ భూమిని పంచుకుంటున్నా పత్తాలేని అధికారులు



ఖానామెట్ ప్రభుత్వ భూమిలోని వంద అడుగుల రహదారిని కబ్జాచేసి వ్యాపార భవనం

- ఖానామెట్‌లో చెలరేగుతున్న భూబకాసురులు
- వంద ఫీట్ల రోడ్డుపైనే వ్యాపార సముదాయం
- ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్న ప్రజలు
- రహదారి ఏర్పాటు స్థలంలో అక్రమ నిర్మాణం

హైటెక్‌సిటీ శేరిలింగంపల్లిలో భూబకాసురులు పూర్తిగా బరితెగించారు. ప్రభుత్వ భూమిలోని వంద అడుగుల రహదారిని సైతం వదలకుండా అడ్డగోలుగా ఆకాశ హర్మ్యాలను నిర్మిస్తున్నారు. వీరి అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు వీరిచ్చే మామూళ్ల మత్తులోపడి జోగుతుండడంతో విచ్చలవిడిగా చెలరేగుతున్నారు. ప్రభుత్వ భూములు, చెరువు కుంటలను పరిరక్షించాల్సిన ప్రభుత్వాధికారులు తమ విధులు విస్మరిస్తూ కనీసం రహదారులనైనా కాపాడలేకపోతున్నారు. ఫలితంగా ఇప్పటికే ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కుకొని నిత్య నరకాన్ని చవిచూస్తున్న హైదరాబాద్ మహానగరంలో ముందు తరాలకు కనీసం నడిచే దారికూడా లేకుండా చేస్తున్న వైనంపై ప్రభాతవార్త వరుస కథనాలు నేటినుంచి..

**సైబరాబాద్ ప్రతినిధి - ప్రభాతవార్త**

ఒక సామాన్యుడు తన సొంత స్థలాన్ని కాపాడుకునేందుకు అనుమతి లేకుండా చిన్న గదిని నిర్మించుకున్నా ఆగమేఘాలమీద సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేసే మున్సిపల్ అధికారులకు రహదారులనే ఆక్రమించి వెలిసే ఆకాశహర్మ్యాలు కనిపించవు. ఒక నిరుపేద తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వ స్థలంలో చిన్న గూడు నిర్మించుకున్నా అతను దేశద్రోహం చేసినట్లు హడావుడిచేసే రెవెన్యూ అధికారులకు ఏకంగా ప్రభుత్వ భూమిలో పుట్టుకొచ్చే ఏడంతస్తుల మేడలు కూడా కానరావు. హైటెక్‌సిటీగా అవతరించి అంతర్జాతీయంగా పేరొందిన శేరిలింగంపల్లిలో మాత్రం అచ్చుగుద్దినట్లుగా అదే జరుగుతోంది. ఖానామెట్ సర్వేనెంబర్లు 41/12, 41/13ల లో కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయంటూ పదిరోజుల క్రితం ప్రభాతవార్త దినపత్రిక 'ఖానామెట్ స్థలాలు ఖతం' అంటూ ప్రధాన శీర్షికన కథనం వెలువరించింది. అయినా సదరు నిర్మాణంపై చర్యలు తీసుకునేందుకు జిహెచ్ఎంసి అధికారులతోపాటు రెవెన్యూశాఖ అధికారులు సైతం మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోవైపు ఖానామెట్‌లో విలువైన మరికొన్ని స్థలాల్లో సైతం కొత్తగా అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. ఇదిలావుండగా తాజాగా ఓ అక్రమార్కుడు ఇదే ప్రభుత్వ భూమిలో ఏకంగా వంద అడుగుల రహదారిని ఆక్రమించి భారీ వ్యాపార సముదాయాన్ని పూర్తిచేశాడు.

**మూడొందల మీటర్లకు గాను 3 కిలోమీటర్ల నరకయాతన**

హైటెక్‌సిటీ నుంచి కూకట్‌పల్లి జెఎన్‌టియు వరకు ఉన్న ప్రధాన రహదారిని హైటెక్స్ హెచ్ఐసిసికి అనుసంధానం చేసేందుకు నూతనంగా వంద అడుగుల రహదారిని నిర్మిస్తున్నారు. యశోద ఆసుపత్రి నుంచి ఖానామెట్ చౌరస్తా వరకు నూతనంగా నిర్మిస్తున్న ఈ రహదారి ఇజ్జత్‌నగర్ వరకు ఏర్పాటుకాగా అక్కడ దాదాపు మూడువందల మీటర్ల దూరంలోని ప్రభుత్వ స్థలంలో ఇప్పటికే కొన్ని అక్రమ నిర్మాణాలు ఉండడంతో వాటి తొలగింపు కోసం రహదారి నిర్మాణం ఆగిపోయింది. ఇదే అదునుగా సరిగ్గా రహదారి ఏర్పాటు చేయాల్సిన స్థలంలోనే సదరు అక్రమార్కుడు ఆగమేఘాలపై అక్రమ నిర్మాణం మొదలుపెట్టి అధికారుల అండతో పూర్తిచేసి ఇతరులకు అద్దెకిచ్చేందుకు సిద్ధమయ్యాడు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటుకానున్న రహదారిపైనే భారీ వ్యాపార సముదాయం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇక్కడ రోడ్డు విస్తరణ ఇక దాదాపుగా ఆగిపోయినట్లయింది. ఇప్పటికే ఈ రహదారి వాహనాల రద్దీ సమస్యను ఎదుర్కొంటుండడంతో ట్రాఫిక్ పోలీసులు గత కొంతకాలంగా ఇక్కడ వన్‌వేను ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు కేవలం ఖానామెట్ చౌరస్తా నుంచి హైటెక్‌సిటీ, జెఎన్‌టియు ప్రధాన రహదారికి చేరుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది. ఇక్కడ వన్‌వే కారణంగా అటువైపు నుంచి వచ్చే వాహనదారులు హైటెక్స్, హెచ్ఐసిసి, కొండాపూర్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు కేవలం మూడు వందల మీటర్ల దూరానికి బదులు హైటెక్‌సిటీ, శిల్పారామం, మెటల్‌చార్మినార్ మీదుగా పూర్తిగా ట్రాఫిక్ రద్దీలో దాదాపు మూడు కిలోమీటర్లు తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ భవనం ప్రారంభమైతే ఇక్కడ వ్యాపారం కోసం అద్దెకు తీసుకున్నవారే తొలగింపునకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లే అవకాశముంది. నిర్మాణ సమయంలో అడ్డుకుంటే గోటితోపోయేదాన్ని వదిలేసిన అధికారులు గొడ్డలివరకు వస్తారన్న నమ్మకం ఎవరికీ లేదు. ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి ఈ నిర్మాణాన్ని తొలగించని పక్షంలో లక్షలాదిమంది వాహనదారులు నిత్యనరకం చూడక తప్పదు.

## బిఆర్ఎస్ పార్టీకి ఝలక్ ఇచ్చిన బండ్లగూడ మేయర్

- మేయర్ పీఠాన్ని కాపాడుకునేందుకే పార్టీ మారాడంటున్న ప్రత్యర్థులు
- ఎవరొచ్చినా పాత వారికే ప్రాధాన్యత ఉండాలంటున్న కాంగ్రెస్ నేతలు



సింఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, నలుగురు కార్పోరేటర్లు

నార్సింగి, మార్చి 4 ప్రబాతవార్త : రంగారెడ్డి జిల్లాలోని "బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్" మేయర్ మహేందర్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీకు భారీ ఝలక్ ఇచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పార్టీలో వివిధ హోదాలలో, పదవులలో పని చేసి గత నాలుగేళ్ళ నుంచి మేయర్‌గా కొనసాగుతూ వస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ మరో ముగ్గురు కార్పోరేటర్లతో కలిసి సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేవెళ్ల గడ్డపై సీఎం రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ ఒక్క ఎంపి సీటునైనా గెలిచి చూపించాలని సవాల్ చేయడం, దానిలో భాగంగానే బిఆర్ఎస్ పార్టీ ఆధీనంలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో ప్రధాన నాయకులు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, కార్పోరేటర్లు, కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. బండ్లగూడ కార్పోరేషన్‌లో 16.మంది కార్పోరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం పెట్టి ఏకంగా 34రోజులు క్యాంపు రాజకీయాలు చేయడంతో మేయర్ మహేందర్‌గౌడ్ తన వర్గం కార్పోరేటర్లతో కలిసి అధికార కాంగ్రెస్‌లోకి వెళితేనే.. పదవీ గండంను దాటుతామని సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నట్లు తెలుస్తుంది. పదవిని కాపాడుకోవడంతో పాటు అవసరమైన నిధులను పెద్ద ఎత్తున తీసుకు రావచ్చన్న ఆశ కూడా కనిపిస్తుంది. పీఠంను కాపాడుకునేందుకు మేయర్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన ప్రత్యర్థి వర్గం సభ్యులు ఖంగు తిన్నారు. మేయర్ వేసిన ఈ అడుగుకు ఎలా స్పందించాలో కూడా ప్రత్యర్థులు కొంత వెనుకా ముందు అవుతున్నారు. మేయర్ పీఠం బిఆర్ఎస్ పార్టీ, మాజీ మంత్రి కేటీఆర్ పెట్టిన బిక్ష అని, ఇన్నాళ్లు అధికారంను అనుభవించి, పార్టీ కష్టకాలంలో అండగా ఉండకుండా విశ్వాస ఘాతకానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. మేయర్‌కు అధికారం ఒక్కటే కావాలా? విలువలు పట్టవా? అంటూ విమర్శలు చేస్తున్నారు. దమ్ముంటే మేయర్ పదవికి, బిఆర్ఎస్ గుర్తుపై గెలిచిన కార్పోరేటర్ పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలువాలని ప్రత్యర్థి వర్గం సభ్యులు సవాల్ చేస్తున్నారు. మేము పార్టీలోనే ఉండి మేయర్ ఒంటెద్దు పోకడలు వ్యతిరేకించామని, ఆయనను చట్ట పరంగా దించాలని ప్రయత్నించామని, ఇలా పార్టీలు మారలేదని, ఇప్పటికీ విలువలకు కట్టుబడే ఉన్నామంటున్నారు. మేయర్ వర్గంలో కేవలం ముగ్గురే ఉన్నారని, మా వర్గంలో 17.మంది కార్పోరేటర్లము ఉన్నామని, మేయర్ అధికార పార్టీలో చేరినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని అభిప్రాయ పడుతున్నారు. మెజారిటీ కార్పోరేటర్ల అంగీకారం లేకుండా ఒక్క తీర్మాణం కూడా చేయలేని మేయర్ పదవిని ఉంచుకొని ఏమి చేస్తారో మేమూ చూస్తామని మేయర్ వైరి వర్గం కార్పోరేటర్లు పేర్కొంటున్నారు. మేయర్ మహేందర్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మింగలేక, కక్కలేక అన్న చందంగా స్పందిస్తున్నారు. అయిష్టమే అయినా సీఎం రేవంత్‌రెడ్డిని కలువడంతో పార్టీ పిసిసి ఇంచార్జి దీపదాస్ సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకోవడంతో కాదనలేక మిన్నకుండి పోతున్నారు. తాము మూడు దశాబ్దాలుగా విలువలకు కట్టుబడి, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీని వీడలేదన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా, ఎంత మంది వచ్చినా మాకు అభ్యంతరం లేదంటున్నారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం వంటిందని, ఎంత మంది మిగతా సిటీ 3వ పేజీలో

## వాస్తు దోషమా..? పనిలో నిర్లక్ష్యమా..?

- బోరబండ పీఎస్‌లో ఎక్కువ కాలం కొనసాగని ఇన్‌స్పెక్టర్లు
- గతేడాది జూన్ 2 న కొత్తగా ఏర్పాటైన పోలీసుస్టేషన్
- 8 నెలల్లో 4గురు సిఐలు మారారు

యూసుఫ్‌గూడ, మార్చి 4, ప్రభాతవార్త : హైదరాబాద్ వెస్ట్‌జోన్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన బోరబండ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఏ ఇన్‌స్పెక్టర్ కూడా ఎక్కువ కాలం కొనసాగడంలేదు. స్టేషన్ ప్రారంభించిన ఎనిమిది నెలల్లోనే నలుగురు ఇన్‌స్పెక్టర్లు మారారు. ఇలా ట్రాన్స్‌ఫర్ అవుతుండగా.. పోలీస్ స్టేషన్‌కు ఏమైనా వాస్తు దోషం ఉందా.. అని స్థానికులు చర్చించుకుంటున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో నాలుగు పోలీస్ స్టేషన్లు బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, పంజాగుట్ట, సంజీవరెడ్డి నగర్ ఉండేవి. జనాభా పెరుగుదలతో పాటు కేసుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో 2023 జూన్ 2న కొత్తగా బోరబండ పీఎస్‌ను ఏర్పాటు చేశారు. పీఎస్ తొలి ఇన్‌స్పెక్టర్‌గా కె.రవికుమార్ బాధ్యతలు చేపట్టగా... అప్పటి సిటీ పోలీస్ కమీషనర్ స్టేషన్‌ను సందర్శించి రౌడీ షీటర్ల ఇండ్లను చూపించాలని ఆదేశించారు. దీంతో ఇన్‌స్పెక్టర్ చూపించకపోగా విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నాడనే కారణంతో ఆయనను కమీషనరేట్‌కు అటాచ్ చేశారు. రెండో ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.విజయ్ వచ్చి కొద్దిరోజులకే మరో ప్రాంతాలకు బదిలీపై వెళ్ళిపోయాడు. మూడో ఇన్‌స్పెక్టర్‌గా ఆదిరెడ్డి బాధ్యతలు తీసుకోగా.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజుల కిందట ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆయన స్థానంలో వీర శేఖర్ చార్జ్ తీసుకోనున్నారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటైనప్పటి నుంచి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్ మాత్రమే కంటిన్యూగా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ల ట్రాన్స్‌ఫర్ల వెనుక ఫిర్యాదు దారుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారనేది ప్రచారంలో ఉంది.

## కార్పొరేట్ స్థాయిలో అంగన్‌వాడి కేంద్రాల నిర్మాణం

### మంత్రి పొన్నం ప్రభాకర్



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కలెక్టర్

సికింద్రాబాద్, సంజీవరెడ్డి నగర్, మార్చి 4 ప్రభాతవార్త: కార్పొరేట్ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను తిర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సనత్‌నగర్ నియోజకవర్గం బల్కంపేటలో 16లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్‌వాడి భవనాన్ని, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని న్యూబోయిగూడ గొల్లకొమురయ్య కాలనీలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమలతలో కలిసి ప్రారంభించారు. మనబస్తీ, మనబడి కార్యాక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కటి విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్రాలను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అకేశ్వర్‌రావు, సికింద్రాబాద్ సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ హరిప్రియా, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

### చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించడం అన్యాయం

నిజాంపేట్, మార్చి 4, ప్రభాతవార్త : నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ప్రగతినగర్ కమాన్ వద్ద మెయిన్ రోడ్డుకు ఉన్న చిరు వ్యాపారుల డబ్బాలను అక్రమంగా అన్యాయంగా అధికారులు తొలగిస్తున్నారని సిఐటియు బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పోరేషన్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కమీషనర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంత్సరాలుగా రోడ్డు పక్క బైక్ సర్వీసింగ్స్, టీ సెంటర్స్, టిఫిన్, ఆల్పాహారం సెంటర్లు నడుపుకుంటూ చిరు వ్యాపారం నిర్వహిస్తు స్వయం ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.శంకర్, ఎన్.బాలపీరు, రాములు, ఎన్.నరసింహా, శేఖర్, పాపయ్య, వసంత, బుజ్జమ్మ, ఇబ్రహీం, ప్రసాద్, సూర్యప్రకాష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 4 ప్రభాతవార్త : అనుమానంతో భార్య తలపై ఓ భర్త బండరాయితో కొట్టి అతి దారుణగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.మధు కథనం ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన అమృతి సాహు (40) బతుకు దెరువు కోసం రాజేంద్రనగర్‌లోని కింగ్స్ కాలనీకి వచ్చాడు.వృత్తి రీత్యా మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మొదటి భార్యతో విభేదాలు వచ్చి విడి పోయారు. రెండు సంవత్సరాలు క్రితం అమృతి సాహు మధు బాల (29)ను రెండవ వివాహం చేసుకున్నాడు. వీరికి సంవత్సరం వయస్సు గల పాప ఉంది. గత కొద్ది రోజులుగా భార్య మధుబాలపై భర్త అమృతి సాహుకు అనుమానం ఏర్పడింది. కింగ్స్ కాలనీలో తాము నివాసం ఉంటున్న ఇంట్లో సోమవారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో భర్త అమృతి సాహు భార్య మధు బాల తలపై బండ రాయితో కొట్టడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మధు బాల మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.భార్యను హత్య చేసిన భర్త అమృతి సాహును పోలీసులు అరెస్ట్ చేశారు.

## బోరు నీళ్లకు పన్నులు విధిస్తే సహించేది లేదు : సిపిఎం



బోరు నీళ్లకు మీటర్లు పెట్టకూడదని బోర్డు సిఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

కంటోన్మెంట్, మార్చి 4 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి, కనీస సౌకర్యాలు మెరుగుపర్చడంలో కేంద్ర ప్రభుత్వం, కంటోన్మెంట్ బోర్డు పూర్తిగా విఫలమైందని సిపిఎం గ్రేటర్ కార్యదరిశ ఎం.శ్రీనివాస్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బోరు నీళ్లకు మీటర్లు బిగించి పన్నులు వేసే విధానాన్ని నిరసిస్తూ సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడుతూ ప్రజలకు మంచినీటి సరఫరా చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సింది పోయి. పన్నులు విధించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయడం సరైంది కాదన్నారు. 20 వేల లీటర్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సాగునీరు సరఫరా చేస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం బోర్ నీళ్లకు మీటర్లు బిగించి ఛార్జీలు వసూల్ చేయడం సరైంది కాదన్నారు. అనంతరం ఈ అంశంపై సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యర్యవర్గ సభ్యులు కె.ఎన్.రాజన్న, సిపిఎం నాయకులు ఆర్.మల్లేశ్, ఎం. అజయ్ బాబు, నారాయణ, యాదగిరి పాల్గొన్నారు.

### పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు

పేట్ బషీరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త : పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్ఓగా కోత విజయ్ వర్ధన్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన జి. ప్రశాంత్ రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీపై వెళ్ళగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది పూలదండలు, పువ్వులు చల్లి ఘనంగా వీడ్కోలు తెలిపారు. మాధాపూర్ ఎస్ఓటీలో పని చేసిన విజయ్ వర్ధన్ పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్ఓగా బాధ్యతలను చేపట్టారు.

## ఉచిత విద్యుత్ బిల్లులపై కలవరం

- కుత్బుల్లాపూర్ సర్కిల్‌ను చుట్టుముట్టిన ప్రజలు
- పోలీసుల ప్రవేశంతో సద్దుమణిగిన ఆందోళన

కుత్బుల్లాపూర్, మార్చి 4 ప్రభాతవార్త : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు సిద్దమైన ఉచిత విద్యుత్ వ్యవహారం బెడిసికొట్టి ప్రజలు ఆందోళన బాటపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి గృహ వినియోగదారుడికి ఉచిత విద్యుత్ 200 యూనిట్ల వరకు ఉంటుందని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు తమకు ఉచితకరెంటు వస్తుందని భావించారు. అయితే తీరా మార్చి నెలవిద్యుత్‌బిల్లులు 200యూనిట్ల లోపు వచ్చిన వారికి యూనిట్ల ప్రకారం బిల్లులు రావడంతోపాటు తమ చుట్టుపక్కలవారికి సున్నా బిల్లులు రావడం తాము దర ఖాస్తు చేసుకున్నా వాడిన విద్యుత్‌కు బిల్లులు చెల్లించాలంటూ వాడిన కరెంట్‌కు రూపాయలతో సహ బిల్లులు రావడంతో సోమవారం ఒక్కసారిగా వందలాది మంది ప్రజలు కుత్బుల్లాపూర్, గాజులరామారం మున్సిపల్ సర్కిల్ కార్యాలయాలను ముట్టడించారు. దీనితో సరైన సమాచారం లేక అధికారులు ఎంత నచ్చచెప్పినా వారు వినిపించుకోక పోవడం,వాగ్వివాదానికి దిగటంతో దిక్కుతోచని స్థితిలో సర్కిల్ ఉపకమిషనర్‌లతో పాటు వివిధ విభాగాల అధికారులు పోలీసులను ఆశ్రయించగా ఆందోళన సద్దుమణిగింది.

## ఇంట్లోకి చొరబడి

### రెండో అంతస్థు నుంచి దూకి పరారీ

హైదరాబాద్, మార్చి 4 ప్రభాతవార్త : నగరంలోని నిజాంపేటలో ఓ గుర్తు తెలియని వ్యక్తి హల్‌చల్ చేశాడు. స్థానిక అపార్టుమెంట్‌లోని ఓ ఫ్లాట్‌లోకి చొరబడి తలుపులు వేయడంతో ఆ ఇంట్లోత ఉన్న మహిళ ఒక్కసారి భయంభ్రాంతులకు గురయ్యారు. వెంటనే తేరుకుని వీడియో రికార్డు చేయడం మొదలు పెట్టడంతో ఫ్లాట్ నుంచి బయటకు వచ్చా డు. నువ్వు ఎవరు? నీ పేరేంటి అంటూ ప్రశ్నించే సరికి, రెండో అంతస్థు నుంచి కిందకు దూకి పారిపోయాడు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. మహిళలు, వృద్దులు అప్రమత్తంగా ఉండాలంటూ పలువురు పోస్టులు పెడుతున్నారు.



బేస్‌మెంట్ తొలగిస్తున్న అధికారులు

## ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

దుండిగల్, మార్చి 4 ప్రభాతవార్త: గండిమైసమ్మ-దుండిగల్ మండలం బహాదూర్‌పల్లి పరిధి సర్వేనంబర్ 227లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలను సోమవారం గిర్దావర్ భారతి ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది తొలగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. ఆక్రమణలకు పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఏలు పాల్గొన్నారు.

## సిఎం ఒఎస్డీకి అభినందనలు



సిఎం ఒఎస్‌డి అజిత్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధులు సంకి రవీందర్, ఏబేలు తదితరులు

కంటోన్మెంట్, మార్చి 4 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు రా ష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.48 కోట్లు టీపిటీ బకాయిలను చెల్లించినందుకు ఎలివేటెడ్ కారిడార్ (స్కైవే)ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినందుకు సోమవారం సిఎం ఓఎస్‌డి అజిత్ రెడ్డిని కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం ఏబేలు, ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబులు కలిసి అభినందనలు తెలియజేశారు. అదే విధంగా కంటోన్మెంట్ బోర్డుపై పూర్తి అవగాహన కలిగి ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద మోడీకి ప్రతిపాదనలు పంపినట్లు అజిత్ రెడ్డి తెలిపారు. దీంతో సంతోషం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చాలి

### క్యెప్టెన్ ఎస్.ఎన్.రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాల్లో బ్రిలియంట్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు

అడ్డగుట్ట, మార్చి 4 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభకనబర్చాలని తెలంగాణ రాష్ట్ర ఏవియేషన్ అకాడమీ సిఈఓ,కార్యదర్శి క్యెప్టెన్ ఎస్.ఎన్.రెడ్డి తెలిపారు. బోయిన్‌పల్లిలోని దిబ్రిలియంట్ టాలెంట్ స్కూల్ 26వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.కె. ఆర్.సతీష్, ప్రిన్సిపాల్ ఎస్.మీనాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులకు మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో సమ్మయ్య, రాజ్‌గోపాల్, చంద్ర మౌళి, సంధ్యా రాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బెంగాలీల సమస్యల పరిష్కారం కోసం కృషి

### చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ



చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీకి మెమోంటోను ప్రధానం చేస్తున్న దృశ్యం

చార్మినార్, మార్చి 4 ప్రభాతవార్త : పాతబస్తీలోని బెంగాలీల సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల కృషి చేస్తానని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్‌అలీ అన్నారు. ఘాన్సీ బజార్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీని బెంగాలీలు సన్మానించి మెమోంటోను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్,ప్రతినిధులు,మందిర నస్కర్,దేబ్‌జీత్‌లు పాల్గొన్నారు.

## ఉత్సాంహాగా సాగిన 'సోప్‌బాక్స్ రేస్'

హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త: ఫిల్మ్‌నగర్‌లోని రామానాయుడు స్టూడియోలో సోమవారం నిర్వహించిన" రెడ్‌బుల్ సోప్‌బాక్స్ రేస్ " ఉత్సాహంగా సాగింది. సృజనాత్మకత, వినోదం, గ్లామర్ కలగలిన ఈరేస్‌లో కామిక్స్,గేమర్స్, ఆర్టిస్టులు సందడి చేశారు. స్పెయిన్, ఇటలీ, యుకె, యుఎస్ఏ, ఫ్రాన్స్, జర్మని వంటి దేశాలతో సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈరేస్ ఈసారి హైదరాబాద్‌లో జరిగింది. గురత్వాకర్షణ శక్తితో నడిచే సోప్‌బాక్స్ వాహనాలను రూపొందించడంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బృందాలు తమ చాతుర్యాన్ని, అభిరుచిని ప్రదర్శించాయి. ఈపోటీలకు దేశంలోని 23రాష్ట్రాలనుంచి 3300 రిజిస్ట్రేషన్లు వచ్చాయి. కాగా రెండురోజులపాటు జరిగిన ఈరేస్‌లో హైదరాబాద్‌కు చెందిన క్రాకన్ వాగన్ అనే జట్టు గెలుపొందింది. అలాగే రెండోస్థానంలో ముంబై నుంచి వచ్చిన కిత్‌అండ్ కిన్ నిలవగా ..హైదరాబాద్‌కీ ఫేవరేట్ బిర్యానీకి సవారీ మూడో స్థానంలో నిలిచింది. దీనికి సినీప్రముఖులు రాణాదగ్గుపాటితోపాటు భారత మాజీ చెస్ క్రీడాకారిని తానియా సచ్‌దేవ్, హాకీ క్రీడాకారుడు మన్‌ప్రీత్‌సింగ్, లాల్ రెమ్ సిమియా హాజరయ్యారు.

## గ్రేవ్ యార్డు ఏర్పాటు ముస్లీంల కోరిక

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో గ్రేవ్ యార్డును సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న తలసాని

బేగంపేట మార్చి 4,ప్రభాతవార్త : బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో గ్రేవ్‌యార్డ్ ఏర్పాటు ఎన్నో సంవత్సరాల ముస్లీంల కోరిక అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని గ్రేవ్‌యార్డును తలసాని సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న భవనం,కాంపౌండ్ వాల్ నిర్మాణం,ఇతర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేవ్‌యార్డుకోసం సుమారు 2ఎకరాల భూమిని కేటాయించడమే కాకుండా,నిర్మాణం కోసం 2.95కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు.గ్రేవ్ యార్డు స్థలంలో సుమారు 200లారీల వ్యర్థాలను తరలించి చదును చేస్తున్నట్లు చెప్పారు. పనులు మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్మక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరి,డిసి సమ్మయ్య,ఈఈ సుదర్శన్,వాటర్‌వర్క్స్ జీఎం వినోద్,బీఆర్ఎస్‌నాయకులు శ్రీహరి,డివి.నరేందర్ రావు నాయి,శ్రీనివాస్,గౌడ్,ఆరీఫ్,వాహెద్ తదితరులు ఉన్నారు.

## మహాశివరాత్రికి ముస్తాబైన సంగమేశ్వరస్వామి దేవాలయం

నాంపల్లి, మార్చి 4 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ వారి ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వర స్వామి-శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 6 బుధవారం నుండి 9 శనివారం వరకు ఆలయ సంప్రదాయానుసారం మహా శివరాత్రి ఉత్సవాలు, పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగం జరిగేందుకు ముస్తాబైంది. ఈ ఉత్సవాల్లో నిత్యహోమంతోపాటు మహాన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార, ఏకవార రుద్రాభిషేకాధి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరుపబడతాయని ఆలయ కమిటీ పేర్కొన్నారు. 6 బుధవారం సాయంత్రం 5.30గంటల నుండి గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, మృత్సంగ్రహణం, అంకురారోపణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, ధ్వజపటాధివాసం తదితర కార్యక్రమాలతో ప్రారంభమై 7 గురువారం ఉదయం 8.30ల నుండి యాగశాల ప్రవేశం, సోమకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ట, గణపతిహోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమములు, ధ్వజాధిహోమం, ధ్వజారోహణం, రాత్రి 7గంటల నుండి భేరి పూజ, తాడనం, నిత్య హోమం, పూర్ణాహుతి, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద వితరణలు; 8 శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్న ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేకం, 7.30 నుండి 9గంటల వరకు ఏకవార రుద్రాభిషేకములు జరుపబడతాయని వారు పేర్కొన్నారు.

## మహా శివరాత్రి సందర్భంగా రుద్రాక్షలు పంపిణీ



సమావేశంలో పాల్గొన్న మహాదేవ్ మందిరం కమిటి ప్రతినిధులు అజయ్ కుమార్ అగర్వాల్ తదితరులు

చార్మినార్, మార్చి 4 ప్రభాతవార్త : చార్‌కమాన్‌లోని చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు రుద్రాక్షలు పంపిణీ చేయనున్నామని ఉత్సవాల కమిటి కన్వీనర్ అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.మహా శివరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఏర్పాట్ల ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో ఈనెల 8వ తేదీన అత్యంత వైభవంగా మహా శివ రాత్రి ఉత్సవాలను నిర్వహించటానికి అన్నిఏర్పాట్లు చేశామని తెలిపారు.మహా శివరాత్రి మహోత్సవాలు రోజున అభిషేకాలు, పూజలు అనంతరం భక్తులకు రుద్రాక్షలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మందిరం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్

సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకుని ఎక్కువ కాలం జీవించాలని మానవ జన్మను సార్థకత చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హిమాయత్‌నగర్‌లోని దత్తానగర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందులో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బస్తీ దవాఖానాలో రోగులకు ఉచితంగా పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిహెచ్ఎంసి డిప్యూటి మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం కోసం నగర వ్యాప్తంగా బస్తీ దవ్వాఖానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## ల్యాబ్ టెక్నిషియన్ల వేతనాలను పెంచాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ ల్యాబ్‌లలో పనిచేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్ల డిమాండ్లను పరిష్కరించాలని ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షులు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్‌ల ఆధ్వర్యంలోని ప్రతినిధిబృదం రెండవ వేతన సవరణ కమిషన్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వేతన సవరణల్లో ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్స్‌కు జరిగిన అన్యాయాలను పూర్తి స్థాయిలో విచారించి న్యాయం జరిగేలా చూడాలని కోరడం జరిగిందన్నారు. . ఈకార్యక్రమంలో కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షులు మహమ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి



హన్మంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఉద్యోగులు

నిజాంపేట్, మార్చి 4, ప్రభాతవార్త : ఆల్విన్ మాజీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు, ప్రగతి నగర్ సీనియర్ సభ్యులు సోమవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అధిక నీటిబిల్లు గురించి, క్యాటరింగ్ వైస్‌గా ఉన్నదాని గురించి, ఆల్విన్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ స్థలం కొరకు ఎమ్మార్వోకి రాసిన లెటర్స్ అందజేశారు. హన్మంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ హోదాలో వారి లెటర్‌హెడ్‌పై సిఫారస్ చేసి వాటర్ వర్క్స్ ఎండీని కలిసి మాట్లాడుతానని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హన్మంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహిస్తున్న వేణుగోపాలస్వామి

## లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం

### వేణుగోపాలస్వామి ధీమా

సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సికింద్రాబాద్ లోక్‌సభ సీటు అశావాహ అభ్యర్థి వేణుగోపాలస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, నారాయణగూడ మీదగా బషీర్‌బాగ్ వరకు వేణుగోపాలస్వామి 'భారత్ జోడో న్యాయ యాత్ర' చేపట్టి మాట్లాడారు. ఈ యాత్రలో ఆయన వెంట వందలాది మంది కా ంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, ప్రజలందరికి న్యాయం అనే సందేశంతోపాటు అణగారిన, దోపిడీకి గురవుతున్న వారికి న్యాయం కోసం రాహుల్‌గాంధీ యాత్ర చేపట్టారని చెప్పారు.

## కంటోన్మెంట్‌కు రూ.49 కోట్లు నిధులు విడుదల చేయడం అభినందనీయం



సిఎంచిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు వెన్నెల గద్దర్, ముప్పిడి గోపాల్, అమరేందర్ రెడ్డి

కంటోన్మెంట్, మార్చి 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డుకు టీపిటీ బకాయిలను 49 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి నందుకు సంతోషం వ్యక్తం చేసేస్తూ కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వెన్నెల గద్దర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి గోపాల్, మర్రి అమరేందర్ రెడ్డిలు, సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.

## ఓబిసి మోర్చా సామాజిక సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు కె.వెంకటేష్,గౌరీ శంకర్ సోనీ

యాకుత్‌పుర, మార్చి 4 ప్రభాతవార్త : పాతబస్తీ దేవిబాగ్‌లో సోమవారం బిజెపి ఓబిసి మోర్చా గోల్కొండ జిల్లా కార్యదర్శి గౌరీ శంకర్ సోనీ ఆధ్వర్యంలో ఓబిసి మోర్చా సామాజిక సమ్మేళనం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబిసి కార్యదర్శి మోకాళ్ళ వెంకటేష్ మాట్లాడుతూ బిజెపి పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఐటి సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేష్, మోర్చా జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి నర్సింగరావు,ఉపాధ్యక్షులు కరణ్ జై,బిజెపి నాయకులు ప్రకాష్ గౌడ్‌తో పాటు సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయిన్ పల్లి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ని కలిసిన న కార్పోరేటర్ ముద్దం



బంజారాహిల్స్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి అశురెడ్డి, మోడల్స్

## పని ఒత్తిడితో ఈనాడు కాల్ సెంటర్ మహిళా ఉద్యోగిని ఆత్మహత్య



సాయికుమారి (ఫైల్ ఫోటో)

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 4 ప్రభాతవార్త: పని ఒత్తిడి కారణంగా ఓ మహిళా ఉద్యోగి నాలుగు అంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్‌లో నివసించే ఎర్రగుళ్ల శ్రీనివాస్‌కు సాయి కుమారితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాయికుమారి 9 సంవత్సరాలుగా రామోజీఫిలిం సిటీలోని ఈనాడు సంస్థలో కాల్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తుంది. భర్త శ్రీనివాస్ కూడా ఫిలిం సిటీలోనే విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయికుమారికి ఉదయం షిఫ్ట్ ఉండడంతో ఆరు గంటలకు ఫిలిం సిటీ బస్సులో విధులకు హాజరయ్యింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈనాడు హెచ్‌ఆర్ కార్యాలయంనుంచి భర్త శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. మీ భార్య సాయికుమారి ఈనాడు బిల్డింగ్‌లోని నాలుగవ అంతస్తునుంచి కింద పడిపోయిందని తెలుపడంతో హుటాహుటిన శ్రీనివాస్ రామోజీ ఫిలిం సిటీలోని ఈనాడు బిల్డింగ్ వద్దకు వెళ్లి చూడగా తన భార్య అప్పటికే రక్తం మడుగులో పడి ఉండడం గమనించాడు. కార్యాలయంలో పని ఒత్తిడి తీవ్రంగా ఉందని తీవ్ర ఒత్తిడి గురవుతున్నానని భర్త శ్రీనివాస్‌కు చెప్పటంతో ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని ధైర్యంగా ఉండాలని చెప్పడంతో ఆదివారం శ్రీనివాస్ తన భార్య కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లి రావడం జరిగిందని అన్నారు. భర్త శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## కూతురితో వివాహిత అదృశ్యం

యూసుఫ్‌గూడ, మార్చి 4, ప్రభాతవార్త : వివాహిత కూతురితో కలిసి అదృశ్యమైన సంఘటన బోరబండ పిఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సునీల్ నగర్‌కు చెందిన ఎం.రమేష్, శిరీష భార్యాభర్తలు, మధురిమ, వందన ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలకు కొన్నేళ్ళుగా గొడవలు జరుగుతున్నాయి. పనిమీద బయటికి వెళ్ళిన భర్త తిరిగొచ్చి చూడగా ఇంట్లో భార్యతో పాటు చిన్న కూతురు వందన కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 8 నుంచి మహా శివరాత్రి వేడుకలు

యూసుఫ్‌గూడ, మార్చి 4, ప్రభాతవార్త : మోతీనగర్ శ్రీ శృంగేరి శారద శంకర మఠంలో మహా శివరాత్రి వేడుకలు ఈనెల 8వ తేది శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి తెలిపారు.శుక్రవారం ఉదయమే శ్రీచంద్రమౌళీశ్వర స్వామి వారికి విశేష అభిషేక అర్చనలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సాయంత్రం 5:30 నిమిషాల నుండి 7:30 నిమిషాల వరకు మహాన్యాస పూర్వక ప్రదోషకాల ఏకవార అభిషేకము, రాత్రి 8:30నిమిషాల నుండి 10గంటల వరకు శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణం, రాత్రి 10:30 నిమిషాల నుండి 12:30నిమిషాల వరకు శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారికి లింగోద్భవ అభిషేకములు, ఈనెల 9వ తేది శనివారం ఉదయం 8:00గంటలకు శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారికి భస్మాలంకారము, ఉదయం 9:30నిమిషాలకు మహామృత్యుంజయ సంపుటిత రుద్రహోమం, పూర్ణాహుతి అనంతరం మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిపేందుకు ఇప్పటికే శంకర మఠంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్



ధర్నాచౌక్, మార్చి 4, ప్రభాతవార్త: గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ఐదు వందల కోట్ల బడ్జెట్‌తో గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు తక్షణమే ఏర్పాటుచేయాలని బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బహుజన్ ముక్తి పార్టీ ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దేవతి శ్రీనివాస్ సచ్చుడో గల్ఫ్ సంక్షేమం బోర్డు తెచ్చుడో అనే నినాదంతో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్య అతిధిగా హాజరై లక్ష్మణ్ మాట్లాడుతూ మన రాష్ట్రం నుండి అనేక మంది ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారని, గత తొమ్మిది సంవత్సరాలలో దాదాపు రెండు వేల మంది కార్మికులు చనిపోవటంతో వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబానికి ఐదు నుండి పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అక్కడ చనిపోయిన కార్మికుల డెడ్‌బాడీ రెండు రోజుల్లో ఇక్కడ ఇంటికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో బీఎంఎం రాష్ట్ర అధ్యక్షులు ఒలిగి ప్రభాకర్, బీఎంపీ నాయకులు ప్రొఫెసర్ ధర్మయ్య, గుర్రం పల్లి శ్యాంరాజ్, ఉప్పులేటి రాజేందర్, మేకల దాస్, కే.పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయోగాత్మకత ఉట్టిపడేలా శ్రీ గౌతమి సైన్స్‌ఫెయిర్ 2024

కుత్బుల్లాపూర్, మార్చి 4 ప్రభాతవార్త: విద్యార్థులకు విద్య, శారీరక దారుఢ్యంతో పాటు మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహణ అవసరమని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్‌మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ శివరాత్రి యాదగిరి అన్నారు. మాజీ ఎయిర్‌ఫోర్స్ విభాగం రిటైర్డ్ అధికారి రవిరాజుతో కలిసి ఆయన గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని శ్రీ గౌతమి పాఠశాలలో సోమవారం విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన శ్రీ గౌతమి సైన్స్‌ఫెయిర్ 2024 కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈసందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలోకి రాకెట్లను పంపిస్తున్న భారతదేశం స్వయంప్రతిపత్తితో ప్రపంచంలోనే అగ్రగామిగా మారేదిశగా అడుగులు వేస్తుందన్నారు. విద్యార్థులు రూపొందించిన రిమోట్‌సెన్సింగ్ వాహనాల నిర్వాహణను చూసి ఆయన అబ్బురపోయారు. భవిషత్‌లో మరిన్ని విజయాలదిశగా శ్రీ గౌతమి పాఠశాల విద్యార్థులు తమసత్తాచాటాలని సూచించారు. పాఠశాల నిర్వాహకులు రవిరాజు మాట్లాడుతూ ప్రతివిద్యార్థిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పంచశీల శ్రీనివాస్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 15 నుంచి17 వరకు హైలైఫ్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 15,16,17 తేదీల్లో హెచ్ఐసిసి నోవాటెల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలో సినీనటులు అషురెడ్డి, ప్రీతి కుమారి, ప్రియాంక చౌదరి తదితరుల హాజరై ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో స్ప్రింగ్ సమ్మర్ స్పెషల్‌ని ప్రదర్శిస్తుందన్నారు. బ్రైటర్ హ్యూస్, లైఫ్‌స్టైల్‌వేర్, బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్ వంటి యాక్సెరీలు, అభరణాలు ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఛత్రపతి విగ్రహా ఏర్పాటుకు సహకరిస్తా

### కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ



కౌన్సిలర్ క్రిష్ణతో దుండిగల్ వాసులు

దుండిగల్, మార్చి 4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌కు చెందిన పలువురు నాయకులు సోమవారం బిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని వినతి పత్రం ద్వారా ఆయన్ని కోరారు. స్పందించిన క్రిష్ణ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం నాకల అన్నారు. కమిటి ముందుకు రావడం..నాకల సాకారం అవుతున్నందుకు సంతోషంగా ఉందని విగ్రహ ఏర్పాటులో భాగస్వామిని అవుతానని పేర్కొన్నారు.

**వైభవంగా మహాపడిపూజ..** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి నాగులూర్‌లో సోమవారం గురుస్వామి భిక్షపతి ఆధ్వర్యంలో శివస్వాముల 14వ వార్షికోత్సవం, లక్షబిల్వార్చన, శివ ధీపారాధన వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. ఈవేడుకల్లో కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని అభిలషించారు. కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నల్తూరి క్రిష్ణ, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, విష్ణు, బండారి మహేష్, భాను, రవి, శ్రీశైలం కమిటి సభ్యులు భానుగౌడ్, విజయ్‌సాయి, శ్రీకాంత్, రాజ్‌కుమార్, నాగరాజుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సైదాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ దుర్గాభవానినగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసారు. తమ కాలనీలో పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్ రెడ్డి,నప్రధాన కార్యదర్శి నిషికాంత్‌రెడ్డి, కోశాధికారి నాగేశ్వర్‌రావు, ఓం రెడ్డి, రత్నమాచారి, విటలేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో నూతన రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్‌లో అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని హరిజనబస్తీలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించినఅనంతరంఆమె మాట్లాడుతూ డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో నిర్ధేశిత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పార్కు పరిశీలన..** ఆంధ్రాబ్యాంకు కాలని పార్కును కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సోమవారం హార్టికల్చర్ అధికారులతో కలసి పరిశీలించారు. పార్కులో బెంచీలు, గ్రాస్ లాన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యమున, సూపర్‌వైజర్ రవి, ఉషశ్రీ, కాలనీ అధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి శర్మ, కోశాధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం : కార్పొరేటర్



కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ సుజాతనాయక్

వనస్థలిపురం, మార్చి 3 ప్రభాతవార్త : భాగ్యనగర్ కాలనీ ఫేస్ 2 లో రోడ్డు నిర్మాణానికి జిహెచ్‌ఎంసి నిధులు కేటాయించనున్నట్లు హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ తెలిపారు. సోమవారం కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల కోరిక మేరకు కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో 300 మీటర్ల సిసి రోడ్ వేయాలని కాలనీవాసులు కోరడంతో స్పందించిన కార్పొరేటర్ జిహెచ్‌ఎంసి నిధుల ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి, రాజు, మహేష్, గోపాలరావు, రఘుపతిరెడ్డి, సృజన, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో బీజేపి గెలుపు ఖాయం



మల్కాజిగిరి బీజేపి అభ్యర్థి ఈటెలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జగదీష్

నేరెడ్‌మెట్, మార్చి 4 ప్రభాతవార్త: మల్కాజిగిరి ఎంపీ బీజేపి అభ్యర్థిగా అధిష్టానం ఈటెల రాజేందర్ పేరును ఖరారు చేయడంతో మల్కాజిగిరిలోని బీజేపి నాయకుల్లో సంతోషం అధికం అయ్యింది. ప్రజల కోసం నిత్యం పోరాడే వ్యక్తిత్వం, ప్రజల సమస్యల పరిష్కారానికై అధిక ప్రాధాన్యం ఇచ్చే నాయకుడు ఈటెల రాజేందర్‌ను మల్కాజిగిరి ఎంపీ బీజేపి అభ్యర్థిగా ప్రకటించడంతో మల్కాజిగిరి పరిధిలోని బీజేపి నాయకులు సంబురాలు చేసుకున్నారు. బీజేపి సీనియర్ నాయకులు మడిపడగె జగదీష్ గౌడ్ ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా జగదీష్ గౌడ్ మాట్లాడుతూ మల్కాజిగిరిలో బీజేపి పార్టీ విజయం ఖాయమన్నారు. మల్కాజిగిరి పరిధిలోని జిల్లాలు, మండలాలు, డివిజన్ల వారిగా నాయకులు, కార్యకర్తలు ఈటెల రాజేందర్ గెలుపుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై దృష్టి సారించాలి : భాగ్యలక్ష్మి



శానిటేషన్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట, మార్చి 3 ప్రభాతవార్త : మూసారాంబాగ్ డివిజన్‌లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. జిహెచ్‌ఎంసి శానిటేషన్ విభాగం సిబ్బందితో డివిజన్‌కు సంబంధించిన సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాల్డఉతూ ప్రతివారం డివిజన్‌లో పర్యటించి పారిశుద్య నిర్వహణ గురించి పరిశీలించడం జరగుతుందన్నారు. డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని పరిశీలించారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో దినేష్, రమేష్, నర్సింగ్, సుభాష్, శ్రీను, ముజీబ్, శ్రీనివాస్, శ్రీనునాయక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి: మహేష్ భగవత్



హెల్మెట్లను పంపిణీ చేస్తున్న ఐపిఎస్ మహేష్ భగవత్

సరూర్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని రైల్వేలు, రహదారి భద్రతా విభాగం అదనపు డిజిపి ఎం.మహేశ్ భగవత్ పిలుపునిచ్చారు. ఐసిఐసిఐ లాంబార్డ్, ట్రాక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ సిల్వర్ డ్రాప్స్ హైస్కూల్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన రైడ్ టు సేఫ్టీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సిల్వర్ డ్రాప్స్ విద్యా సంస్థల చైర్మన్ జె.శ్రీనివాసరావు తదితరులతో కలిసి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు, పిల్లలకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీచేశారు. అనంతరం రోడ్ సేఫ్టీ ర్యాలీని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనాదారుల్లో చైతన్యం కలిగించి వారికి అవగాహన కల్పించడానికి రైడ్ టు సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఐసిఐసిఐ లాంబార్డ్, ట్రాక్ సంస్థలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులతో పాటు ఎల్‌బినగర్ డిసిపి శ్రీనివాస్, మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కాశీ విశ్వనాథ్, సిల్వర్ డ్రాప్స్ చైర్మన్ జె.శ్రీనివాసరావు, హెడ్మాష్టర్ శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌ఫెయిర్లతో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది: చైర్మన్ రాధాకృష్ణ



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న చైర్మన్ రాధాకృష్ణ

హయత్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త: ఆలోచనలు భిన్నంగా ఉంటే... ఆవిష్కరణలు సైతం విభిన్నంగా ఉంటాయని శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ జి.రాధాకృష్ణ అన్నారు. హయత్‌నగర్ ప్రాంతం రాజరాజేశ్వరికాలనీలోని శాంతినికేతన్‌బ్లూమ్స్‌లో గురువారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ (విద్యావైజ్ఞానిక ప్రదర్శన)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సైన్స్ ఫెయిర్లతో విద్యార్థులలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన, ఆసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థుల సృజనాత్మక, మేథాశక్తికి సైన్స్‌ఫెయిర్లు ప్రతిరూపంగా నిలుస్తాయన్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించడంతో శాంతినికేతన్ విద్యాసంస్థలు ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు ఝాన్సీ, డీన్ ఫణిశ్రీ ప్రభంజనీ, వైస్‌ప్రిన్సిపల్ రోహిణి పాల్గొన్నారు.

## శివాలయం కమిటీ చైర్మన్‌గా శశిధర్‌రెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి, డైరెక్టర్లు

సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామంలోని పురాతన శివాలయం (మహాదేవరజీ ఆలయం) నూతన చైర్మన్‌గా గ్రామానికి చెందిన టేకుల శశిధర్‌రెడ్డి, డైరెక్టర్లుగా ఇక్కె మాధవి శ్రీనివాస్, కళ్లెం శ్రీధర్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, పగడాల ఉమేష్‌లు నియమితులై సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరి జైహింద్, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్‌లతో పాటు పలువురు గ్రామస్తుల సమక్షంలో వారిచే దేవాదాయ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, టేకులసుధాకర్‌రెడ్డి, కళ్లెం మల్లారెడ్డి, మేకల సంజీవ, బాల్‌నింగని జంగయ్య, పన్నాల రాజేందర్‌రెడ్డి, తూళ్ళ నరహరిగౌడ్, రావుల లింగం, గుండోజు వెంకటాచారి, కళ్లెం విష్ణువర్ధన్‌రెడ్డి, బొక్క కొండల్‌రెడ్డి, నీరుడు శ్రీరాములు, గండికోట యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు : జడ్‌సి

మలక్‌పేట, మార్చి 3 ప్రభాతవార్త : ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌యంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న తెలిపారు. చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్‌కు చెందిన ఆస్తి పన్ను సమస్యలపై 3 ఫిర్యాదులు, మలక్‌పేట్ సర్కిల్లోని అక్రమ నిర్మాణం, చాంద్రాయణగుట్ట సర్కిల్‌లోని నాలా విస్తరణ, విద్యుత్ స్తంభం సమస్యలకు సంబంధించిన మొత్తం 6 ఫిర్యాదులందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, డిప్యూటీ డైరెక్టర్ (యూ బి డి) అమీనా బీ, టౌన్ ప్లానింగ్ జోన్ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, ఎ. యం సీ రాజారావు, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ఈఈ హరి కిషోర్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా నియమించిన సందర్భంగా బి.యన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ నాయకులతో కలిసి ఈటెలను కలిసిన దృశ్యం (ప్రభాతవార్త, వనస్థలిపురం)

## మల్లాపూర్ ఎన్‌ఎఫ్‌సీ ఆర్‌వోబీ బ్రిడ్జి పనులు పూర్తి చేపట్టాలని మేయర్‌కు వినతి



నగర మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పోరేటర్ దేవేందర్‌రెడ్డి

నాచారం, మార్చి 4 ప్రభాతవార్త: మల్లాపూర్ ఎన్‌ఎఫ్‌సీ ఆర్‌వోబీ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేపట్టాలని, అశోక్‌నగర్ మెయిన్ రోడ్డు హెచ్‌ఆర్‌డీసీ పనులను వేగవంతంగా చేపట్టాలని కోరుతూ సోమవారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. 45 సవంత్సరాల క్రితం అప్పటి అవసరాల కోసం ఎన్‌ఎఫ్‌సీ బ్రిడ్జిని ఏర్పాటు చేశారని ప్రస్తుతం వాహణాలరద్దీ పెరగడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని మేయర్‌కు పన్నాల విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల కోసం తగిన చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిదంగా డివిజన్‌లో ప్రధానంగా భూగర్భడ్రైనేఈజ సమస్యను కూడా పరిష్కరించాలని, మ్యాన్ హోల్స్‌ల నుంచి తీసిన మట్టి వేస్టేజీని వెంటనే అక్కడి నుంచి సిబ్బంది తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

## క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరాలి



జ్యోతిని వెలిగిస్తున్న గిరిధర్, మణిదీపిక

హయత్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త: విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలని వనపర్తి డీఎస్పీ రాందాసుతేజ, ఎల్.బి.నగర్ ఏసీపీ ఎ.కృష్ణయ్య అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామంలోని సన్‌రేస్ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన 11వ వార్షికోత్సవానికి హాజరైన వారు మాట్లాడుతూ... విద్యార్థులు విద్యా నైపుణ్యాలను పెంచుకుని ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా క్రమశిక్షణతో మెలిగి సామాజిక సేవా దృక్పదాన్ని అలవర్చుకుని ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేలా యాజమాన్యం వినూత్న కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. అనంతరం ఆయా విభాగాలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు వారు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మహేశ్వరుడిని ప్రార్థిస్తూ చేసిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నాగమల్లు, సెంట్రల్ గవర్నమెంట్ స్టాండింగ్ కౌన్సిల్ ఇన్ హైకోర్టు ఆఫ్ తెలంగాణ మణిదీపిక, స్కూల్ కరస్పాండెంట్ గిరిధర్ పాల్గొన్నారు.

## జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం



ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన సామిడి గోపాల్‌రెడ్డి

సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త: చారిత్రక కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర ఐటి, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. సోమవారం ఉదయం ఆలయానికి విచ్చేసిన మంత్రిని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి పలువురు నాయకులతో కలిసి శ్రీధర్‌బాబును శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

## బచ్‌పన్ స్కూల్‌లో స్నాతకోత్సవ వేడుకలు



స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వనస్థలిపురం, మార్చి 3 ప్రభాతవార్త : వనస్థలిపురం హిల్‌కాలనీ బచ్‌పన్ స్కూల్ లో స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ రీజినల్ డైరెక్టర్స్ కె.శ్రీకాంత్‌రెడ్డి, కె.రూపారెడ్డి, వనస్థలిపురం బచ్‌పన్ హైట్స్ ప్రిన్సిపల్ ఎస్.కల్పవల్లి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశాభివృద్ధికి చిన్నారులే ప్రగతి రథచక్రాలని, బాలలే దేశ ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులని, వీరి చేతుల్లోనే దేశపురోభివృద్ధి ఉందన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, గురువులకు తద్వారా దేశానికి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. ఈ వేడుకలలో స్కూల్ అడ్మిన్ బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా కేబీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న కెబి స్కూల్ యాజమాన్యం

తుర్కయంజాల్, మార్చి 3 ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతో పాటుగా అన్ని రంగాలలో రాణించాలని,హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి వేంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటి కమ్మగూడలోని కేబీ స్కూల్ 27వ వార్షికోత్సవ వేడుకలను మన్నెగూడ జేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన వేంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వారి అనుభవాలను నైతిక విలువలు ప్రాముఖ్యతను, విద్యారంగంలో వస్తున్న మార్పులను గురించి వివరించారు. ముఖ్యంగా నేటి సమాజంలో విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుదోవ పడుతున్నారని వారిని తల్లిదండ్రులు ప్రతిక్షణం గమనించాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతీక కార్యక్రమాలను ఆయన వీక్షించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, లైఫ్ కోచ్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, కేబీ స్కూల్ కరస్పాండెంట్ సీఎన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాచారంలో పల్స్ పోలియో కార్యక్రమం



చిన్నారికి పోలియో చుక్కలను వేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, మార్చి 3 ప్రభాతవార్త: నాచారం డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ బిల్డింగ్‌లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక నాయకులు సాయిజన్ శేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వాసులు డా.కేయన్ రెడ్డి,భూపాల్ రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## స్మశానవాటికలో వసతుల కోసం వినతి

సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త: బాలాపూర్ గ్రామంలోని మాలల స్మశానవాటికలో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అండ్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ కమీషనర్ రఘు, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వినతి పత్రాలు అందజేసిన సొసైటీ అధ్యక్షుడు గుండె నాగార్జున బాబు మాట్లాడుతూ మాలల స్మశానవాటికలో బోరు వేసి నీటి సౌకర్యం కల్పించి షెడ్డు, రహదారి నిర్మాణం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రి చంద్రశేఖర్, క్యారగారి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ళ ఎంపి బరి నుండి కెఎల్‌ఆర్‌ను దింపాలి: తయ్యుబ్ దయాని

సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త: చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని ఎన్నికల బరిలో దింపాలని మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్, సీనియర్ మైనారిటీ నేత తయ్యుబ్ దయాని పార్టీ అధిష్టానవర్గాన్ని కోరారు. చాలా సంవత్సరాల నుండి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అదే విధంగా ఇటీవల కాలంలో మహేశ్వరం నియోజకవర్గంలో మంచి గుర్తింపు పొందిన కెఎల్‌ఆర్‌ను ఎంపి ఎన్నికల్లో పోటీ చేయిస్తే కాంగ్రెస్ తప్పక విజయం సాధిస్తుందని ఆయన తెలిపారు. కెఎల్‌ఆర్‌కు ఎంపి టిక్కెట్ కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సాహంగా పని చేసి ఆయన గెలుపుకు కృషి చేస్తారని తయ్యుబ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో టిక్కెట్‌కు కెఎల్‌ఆర్‌కే కేటాయించాలని కోరుతూ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డిలకు ఫ్యాక్స్ ద్వారా విజ్ఞప్తి చేశామని తయ్యుబ్ దయాని వెల్లడించారు.

## నాచారంలో పేట్రియాట్స్ క్రికెట్ అకాడమిని ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్‌ఆర్



పేట్రియాట్స్ క్రికెట్ అకాడమిలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నాచారం, మార్చి 4 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారంలో ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పేట్రియట్స్ క్రికెట్ అకాడమిని ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేట్రియాట్స్ క్రికెట్ అకాడమి యువ ప్రతిభను అభివృద్ధి చేయడానికి క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డా.ఆర్.లింబాద్రి, రిటైర్డ్ జడ్జి డా. నిమ్మనారాయణ, కేయూ రిటైర్డ్ విసిస డా.ఆర్.సాయన్న, సిఐడీ రిటైర్డ్ ఎస్పీ.ఎస్.జాన్ వెస్లీ, చీఫ్ కోచ్ అజయ్‌కుమార్ సంగెం, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, మల్లేష్ యాదవ్, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంవిఎస్‌ఆర్ కాలేజీకి ఓఇఎంఈఆర్‌ఎస్ ఔట్రీచ్ అవార్డు

సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త: నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక ఓఇఎంఈఆర్‌ఎస్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చర్స్ సొసైటీ) ఔట్రీచ్ అవార్డు లభించింది. నగరంలోని సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఎఐఎంఈఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ వేదికగా జరిగిన కార్యక్రమంలో కాలేజీ తరపున ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కనకదుర్గ అవార్డును స్వీకించారు. అదే విధంగా కళాశాల నుండి డాక్టర్ కె.వేణుగోపాల్‌రావు జీవితకాల సాఫల్య అవార్డును, ప్రొఫెషర్ జయశ్రీ హనుమంతరావు స్టూడెంట్స్ మెంటర్షిప్, డెవలప్‌మెంట్ అవార్డు, డాక్టర్ ఎవి కృష్ణప్రసాద్ మాస్టర్‌టీచర్ అవార్డులను అందుకున్నారు. కాలేజీకి, ప్రొఫెసర్లకు అవార్డులు రావడంపట్ల ఛైర్మన్ పివిఆర్ కశ్యప్, సెక్రటరీ కెవిపి శ్రీనివాసరావులు హర్షం వ్యక్తం చేసి అవార్డు గ్రహీతలను అభినందించారు.

## 5సంల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి : కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి



పోలియో చుక్కలను వేస్తున్న కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి

నేరెడ్‌మెట్, మార్చి 3 ప్రభాతవార్త : 5సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని నేరెడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మార్చి3వ తేదీనా పోలియో దినోత్సవ సందర్భంగా నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లలకు పోలియో చుక్కలను వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు చుక్కలు జీవితానికి వెలుగులని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ బి.ఆర్.ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, డాక్టర్ కపూర్, డాక్టర్ రాజమల్లు, ప్రకాష్, శివ, రమేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**మల్లాపూర్ డివిజన్‌లో...** నేషనల్ ఇమ్యూనైజేషన్ డేను పురస్కరించుకొని ఆదివారం మల్లాపూర్ డివిజన్‌లో అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ముఖ్య అథితులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. మాదవి సిబ్బంది పాల్గొన్నారు.

**లాలాపేట్ హెల్త్ సెంటర్‌లో...** లాలాపేట్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చిన్నారులకు పోలియో చుక్కలు నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి వేశారు. పిల్లలకు విధిగా పోలీయో చుక్కలను వేయించి పోలీయో రహిత సమా జంగా తీర్చిదిద్దేందుకు అందరం కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సౌశీల్యా, కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్‌రెడ్డి, ప్రవీణ్‌లాల్, నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.